

# నవభూమి

## తెలంగాణ

అనుబంధం

30 మే,2025 శుక్రవారం పేజీలు:3

www.epaper.navabhoomi.in


### పార్టీజెండా మోసిన వారికి

# ప్రాధాన్యత



**ముథోల్: –నవభూమి:** మొదటినుంచి కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసి, జెండా మోసిన కార్యకర్తలకి పార్టీ పదవుల్లో ప్రాధాన్యత ఉంటుందని ముథోల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నారాయణరావు పటేల్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన ముథోల్ లో జిఎం పంక్షన్ హాల్లో గురువారం ముథోల్, బాసర, తానుర్, మండలాల కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో జెండా మోసిన వారికి పదవులు వస్తాయని ఇందులో ఎలాంటి అనుమానాలకు తావు లేదని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ వచ్చినప్పుడు నుండి పార్టీలో మొదటి నుండి ఉన్న వారికే పార్టీ పదవుల్లో, నామినేట్ పదవుల్లో ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ఈ సమావేశం తేదీ ముందే ప్రకటించినప్పటికీ, కొంతమంది వాయిదా కోసం ప్రయత్నించిటం సరికాదని అన్నారు. ముందుగా ప్రకటించిన ప్రకారమే ఈ సమావేశం పార్టీ ఆదేశానుసారం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ముథోల్ తానూర్, బాసర మండలాల బ్లాక్, కాంగ్రెస్ కమిటీ, మండల అధ్యక్షులు, కోసం కార్యకర్తలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా కార్యకర్తల అభిప్రాయం మేరకు పదవులకోసం ఎంపిక చేసిన పేర్లను సీల్డ్ కవర్ లో కాంగ్రెస్ పార్టీ పెద్దలకు అందజేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేస్తుందన్నారు. సన్న బియ్యం మహిళలకు బస్సు ఫ్రీ, తదితర పథకాలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ దేని అన్నారు. ఈ కార్యక్రమంలో ముథోల్ ,బాసర ,తానుర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రావుల గంగారెడ్డి, మమ్మాయి రమేష్, మురళి బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ముత్యం రెడ్డి, శంకర్ చంద్రే , నాయకులు ప్రేంనాద్ రేడ్డి, కిషన్ పటేల్, రావుల శ్రీనివాస్, చంద్రకాంత్ యాదవ్, అజీజ్,దిగంబర్, నజీబ్, రాంనాద్, నగేష్, ఆయా మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

# యుగపురుషుడు ఎన్టీఆర్

**జన్నారం–నవభూమి:** యుగపురుషుడు, కారణ జన్ముడు వంటి పదాలు చాలా బరువైనవి. అవి ఓ వ్యక్తికి అతికినట్లుగా సరిపోవడం స్వర్గీయ ఎన్టీఆర్ కు మాత్రమే చెల్లిందని తెలుగుదేశం పార్టీ జన్నారం మండల అధ్యక్షుడు ఉప్పుల విజయ్ పార్లమెంటు నియోజకవర్గ నాయకులు పులి శెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఎన్టీఆర్ జయంతి సందర్భంగా జన్నారం మండల కేంద్రంలోని బస్టాండ్ ముందు తెలుగుదేశం పార్టీ జెండాను ఎగరవేసి అతని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.. సందర్భంగా వారు మాట్లాడుతూ.. నటుడిగా, రాజకీయ నాయకుడిగా అత్యంత విజయవంతమైన ప్రస్థానం ఆయనదన్నారు. ఒకానొక సమయంలో అభిమానులు ఆయన్ను దైవ స్వరూపుడిగా కొలిచారంటే అతిశయోక్తి కాదు. నటనలో శిఖరాల్ని అధిరోహించిన ఎన్టీఆర్, 9 నెలల్లోనే టీడీపి ని అధికారంలోకి తీసుకొచ్చి రాజకీయాల్లోనూ లెజెండ్గా నిలిచారన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ బడుగు బలహీన వర్గాల కోసం పార్టీ పెట్టి అహర్నిశలు వారి అభివృద్ధి కోసం కృషి చేసిన మహా నాయకుడు అన్నారు. అలాంటి మహానాయకుని స్మరించుకోవడం ఎంతో అవసరం అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి, గొల్లపల్లి ప్రసాద్ పట్టణ అధ్యక్షులు ముత్యం పెల్లి నవీన్ ప్రధాన కార్యదర్శి మామిడిపల్లి హరీష్ స్వరాజ్ నాయక్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.




### ప్రజలకు ఇబ్బందులు

# కలగకుండా చూడాలి



**నెన్నెల, –నవభూమి:** వర్షాకాలంలో ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుం డా తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. బుధవారం కలెక్టర్ నెన్నెల మండలంలో పర్యటించారు. భారీ వర్షానికి దెబ్బతిన్న ఎర్రవాగు తాత్కాలిక వంతెనను పరిశీలించారు. వాగు ఉధృతిని తట్టుకునేలా తాత్కాలిక కాజ్‌వే నిర్మాణం చేపట్టాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పనులు పూర్తిచేసి ప్రారంభిస్తే ప్రజల కష్టాలు తీరుతా యన్నా రు. బ్రిడ్జిపనుల్లో వేగం పెంచాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. జంగాల్‌పేట పంచాయతీ పరిధిలోని కొత్తగూడంలో ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. అర్హులైనవారికి పథకం అందేలా లబ్ధిదారుల ఎంపికలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణం పనులను ఎప్పటిప్పుడు రికార్డు చేస్తూ బిల్లులు అందజేయాలని అధికారులను ఆదేశించారు. తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనప్పటికీ అటవీ శాఖవారు అడ్డుకుంటున్నారని కొందరు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు. జోగాపూర్, ఆవడం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ధాన్యం ఎప్పటికప్పుడు కాంటా వేసి కేటాయించిన రైసు మిల్లులకు తరలించాలని సూచించారు. అవసరమైన గోనెసంచులను సమకూరుస్తామని తెలిపారు. ధాన్యం సేకరణ లక్ష్యాన్ని త్వరగా చేరుకునేలా నిర్వాహకులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్, ఎంఆర్ఐ సులోచన, ఎంపీవో శ్రీనివాస్, ఏపీఎం విజయలక్ష్మి, ఎస్సై ప్రసాద్ ఉన్నారు.నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి భారీ వర్షాలు పడే అవకాశం ఉండడంతో జిల్లాలోని చెరువులు పూర్తి స్థాయిలో నిండి పంటలకు, ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్‌లో నీటి పారుదల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకా లంలో జిల్లాలో కురిసే భారీ వర్షాల కారణంగా జిల్లాలోని చెరువు ల్లోని నీటి మట్టాన్ని పర్యవేక్షిస్తూ ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. చెరువులు 90శాతం నిండగానే సంబంధిత అధికారిక గ్రూప్‌లో సమాచారం అందించి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. నీటిపా రుదలశాఖ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై అధికారుల తో సమీక్షించారు. కార్యక్రమంలో నీటిపారుదల ఎస్ఈ విష్ణుప్రసాద్, చెన్నూర్ డివిజన్ల డీఈఈలు, ఎఈఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బడి బస్సులు భద్రమేనా?



## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతులకు తీవ్ర నష్టం



**నెన్నెల, -నవభూమి:** అకాల వర్షాలతో ధాన్యం తడిసి రైతులు తీవ్రంగా నష్టపోవడానికి ప్రభుత్వమే కారణమని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆరోపించారు. మండలంలోని మైలారం, గొల్లపల్లి గ్రామాల్లో దుర్గం చిన్నయ్య బుధవారం పర్యటించారు. వర్షానికి తడిసిన ధాన్యం కుప్పలను పరిశీలిచారు. భాది త రైతులకు అండగా ఉంటామని భరో సా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగో ళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరి స్తోందన్నారు. కోతలు కోసి ధాన్యం కొనే వారి కోసం రైతులు నెల రోజు లుగా ఎదురు చూస్తున్నారన్నారు. ఎప్పటికప్పుడు ధాన్యం సేకరించి మిల్లులకు తరలిస్తే వర్షాలతో రైతులకు నష్టం జరిగేది కాద న్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పంజాల సాగర్‌గౌడ్, నాయకులు ఎండీ ఇబ్రాహీం, ఇందూ రి రమేష్, మేకల మల్లేష్, శ్రీనివాస్‌గౌడ్, ప్రేమ్‌సాగర్, తిరుపతిగౌడ్, శివప్రసాద్, శంకర్ తదితరులు ఉన్నారు.

## ఆపరేషన్ కగార్ పేరుతో.. బూటకపు ఎన్‌కౌంటర్లు చేయడం దుర్మార్గం

**చెన్నూరు, -నవభూమి:** ఆపరేషన్ కగార్ పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్లు చేయడం దుర్మార్గమైన చర్యఅని అరుణోదయ కళాకారిణి, ప్రజాఉద్యమాల పోరాటసమితి అధ్యక్షురాలు విమ లక్క పేర్కొన్నారు. బుధవారం చెన్నూరు పట్టణం లోని పద్మశాలి భవన్‌లో ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి పోచమల్లు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకు డు కాంతయ్య ఆధ్వర్యంలో ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన నిరసన కార్యక్రమ సభ లో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం నక్సలై ట్లను బూటకపు ఎన్‌కౌంటర్లు చేయడం సరైంది కాదన్నారు. నక్సలైట్లతో శాంతి చర్చలు జరపాలని పేర్కొన్నారు. నక్సలైట్ల పేరుతో అమా యక ఆది వాసీ గిరిజనులపై మారణహోమం సాగించడం ఆపాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ హక్కులను, 1/70చట్టాన్ని కాపాడాలని కోరారు. అడవి సంపద ను, ఖనిజాలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నంలో భాగంగా సల్వాజుడుం, ఆపరేషన్ కగార్ పేరుతో ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్లు చేయడం సిగ్గుచేటని తెలిపారు. ఎన్‌కౌంటర్లు చేస్తూ చనిపోయిన వారి మృతదేహాలను కూడా బంధువులకు అప్పగించకపోడం దుర్మార్గమన్నారు. ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అనం తరం ర్యాలీగావెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అం దించారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ రాష్ట్ర నాయ కులు ప్రసాద్, నాగిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం, ఐఎఫ్‌టీయూ రాష్ట్రకార్యదర్శి భాస్కర్, విశ్వనాధ్, సత్యం, ఆదివాసీ నాయకులు కుమార్, సాధు, మల్లన్న, అంజయ్య, చంద్రశేఖర్, జైపాల్ సింగ్, బోడంకి చందు, చంద్రశేఖర్, పౌలు, సమ్మ య్య, వామపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు.




# బడి బస్సులు భద్రమేనా?

**మంచిర్యాల, -నవభూమి:** విద్యాసంస్థల బస్సుల్లో యాజమాన్యాలు విద్యార్థుల భద్రతను గాలికొదిలేస్తున్నాయి. ఫిట్‌నెస్‌లేని బస్సులు నడుపుతూ ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయి. విద్యా సంస్థల బస్సుల్లో పిల్లల రక్షణకు సంబంధించి చర్యలు చేపట్టడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఫిట్‌నెస్ తనిఖీ సమయాల్లో నిబంధనలు పాటిస్తున్నప్పటికీ, ఆ తరువాత పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. జూన్ 12 నుంచి నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కానుండగా, ఆ లోపే విద్యాసంస్థల బస్సుల ఫిట్‌నెస్ ప్రక్రియ పూర్తి చేసుకోవలసి ఉంది. మూడు రోజులుగా ఆర్టీఏ అధికారులు బస్సుల తనిఖీలు చేపడుతుండగా, యాజమాన్యాల నుంచి సరియైన స్పందన లభించడంలేదు. జిల్లావ్యాప్తంగా 380 విద్యాసంస్థల బస్సులు ఉండగా, ఇప్పటి వరకు కేవలం 35 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తయ్యాయి. ఫిట్‌నెస్ పరీక్షలకు వెళితే అధికారులు బస్సులను సీజ్ చేస్తారేమోననే ఉద్దేశంతోనే వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారుల తనిఖీల్లో అనేక బస్సుల్లో లోపాలు బయటపడుతుండటం గమనార్హం. గ్రిల్స్ తప్పనిసరి...బస్సుల్లో ప్రయాణించే విద్యార్థుల భద్రత కోసం బస్సుకు మూడు వైపులా తప్పనిసరిగా ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేయాలనే నిబంధన ఉంది. ముఖ్యంగా పాఠశాలల బస్సుల్లో ప్రయాణించేది చిన్నపిల్లలు కావడంతో బస్సు కదిలేటప్పుడు కిటికీల నుంచి చేతులు బయటకు చాచకుండా గ్రిల్స్ ఏర్పాటు చేయాలి. గ్రిల్స్ లేని కారణంగా ప్రయాణ సమయంలో విద్యార్థులు చేతులు బయట పెట్టిన పక్షంలో ఇతర వాహనాల ద్వారా ప్రమాదం జరిగే అవకాశం ఎంతైనా ఉంది. నామమాత్రంగా ఫైర్ ఎస్టింగిషర్లు? అనుకోని పరిస్థితుల్లో ఏదైనా ప్రమాదం సంభవించి బస్సు లో మంటలు చెలరేగిన పక్షంలో వాటిని ఆర్పేందుకు ఫైర్ ఎస్టిం గిషర్లు అందుబాటులో ఉండాలి. అగ్నిమాపక శాఖ నుంచి అను మతి తీసుకొని బస్సుల్లో ఫైర్ ఎస్టింగిషర్లు ఏర్పాటు చేయాలి. అయితే బస్సులో ఫైర్ ఎస్టింగిషర్స్ కనిపిస్తున్నప్పటికీ, నామ మాత్రంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. అత్యవసర సమయాల్లో అవి పని చేస్తాయో..జలేదో కూడా తెలియని పరిస్థితులు ఉన్నాయి. ప్రథమ చికిత్స డబ్బాలో కానరాని పరికరాలు..విద్యాసంస్థల బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఏర్పాటు చేస్తున్నప్పటికీ అందులో ప్రథమ చికిత్సకు సంబం?ధించి ఎలాంటి పరికరాలు ఉండటం లేదని తెలుస్తోంది. ఫస్ట్ ఎయిడ్ బాక్సుల్లో తప్పనిసరిగా కాటన్, అయోడిన్, స్పిరిట్ బాటిల్, బ్యాండేజ్ ఉండాలనే నిబంధన ఉంది. బస్సుల్లో తదితర వస్తువులు ఉన్న ప్పటికీ అవి కాలం చెల్లి ఉండటం గమనార్హం. చిన్నచిన్న ప్రమాదాలు జరిగినప్పుడు విద్యార్థులకు ప్రథమ చికిత్స అందించేందుకు ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఉపయోగపడతాయి. వీటితో పాటు విద్యార్థులు బ్యాగులు పెట్టుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలి. డ్రైవరుకు సంబంధించిన పూర్తి వివరాలు, ఫోటో పేరు, సెల్ నంబర్ విధిగా ప్రదర్శించాలనే నిబంధన ఉంది. ఊసేలేని డ్రైవర్ల మెడికల్ సర్టిఫికెట్లు..పాఠశాల బస్సుల్లో పనిచేసే డ్రైవర్లకు రెండు సంవత్సరాలకు ఒకసారి వైద్య చికిత్సలు చేయించి మెడికల్ సర్టిఫికెట్ అందుబాటులో ఉంచాలి. కాని ఈ విషయమై యాజమాన్యాలు దృష్టి సారించడంలేదని సమాచారం. డ్రైవర్ పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లు యాజమాన్యాలు ధ్రువీకరించుకోవాల్సిన అవసరం ఉంటుంది. అలాగే హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి ఐదు సంవత్సరాల అనుభవం ఉన్న వారినే డ్రైవర్లుగా నియమించుకోవాలనే నిబంధన కూడా ఉంది. లైట్లు, హ్యాండ్ బ్రేక్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్‌లు, పసుపుపచ్చ రంగు కలిగి ఉండాలి. ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలి: రంజిత్, ఎంవీఐ జిల్లాలో సుమారు 400 బస్సులు ఉన్నప్పటికీ ఇప్పటివరకు కేవలం 35 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తయ్యాయి. జూన్ 12 నుంచి విద్యాసంస్థలు పునఃప్రారంభం ఉన్నందున యాజమాన్యాలు స్పందించాలి. నిర్ణీత గడువులోగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోకుండా బస్సులు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటాము.




## ప్రజలను భయపెట్టి పాలిస్తున్న పాలకులు : వర్ల చంద్రశేఖర్

**వరంగల్ -నవభూమి:** పది సంవత్సరాల పాలనపై ఉన్న వ్యతిరేకతను తొలగించడం కోసం బీజేపీ పాలకులు అపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్థాన్‌తో యుద్ధం చేస్తూ ప్రజల దృష్టిని మరలుస్తున్నారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి అడ్డస్తున్నారని ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను, ఆదివాసీలను, గిరుజనులను ఎన్‌కౌంటర్ల పేరుతో హత్యలు చేసి ప్రజలను భయపెట్టాలని చూస్తున్నరని ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ చంద్రశేఖర్ అన్నారు. గురువారం వెంకటరమణ జంక్షన్‌లోని ఎంసీపీఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన రాష్ట్ర కార్యదర్శిగా వర్ల చంద్రశేఖర్‌ను నూతన రాష్ట్ర కార్యదర్శిగా పార్టీ ప్రకటించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజల దృష్టిని మరల్చి, భయభ్రాంతులకు గురిచేసి ప్రశ్నించే హక్కులను లాగేసుకోవాలని చూస్తున్నదని ఆరోపించారు. దీనిని సహిస్తూపోతే ఏజెన్సీ ప్రాంతాలలో జరుగుతున్న మారణకాండ గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు సైతం పాకుతుందని హెచ్చరించారు. అణచివేత దోరణిని అడ్డుకునే శక్తి కేవలం కమ్యూనిస్టులకు మాత్రమే ఉందని అన్నారు. ఈ పరిస్థితిని ఎదుర్కొని దేశ ప్రజాంద్యమాలను ముందుకు తీసుకువెళ్ళడానికి కమ్యూనిస్టులు ఏకం కావాల్సిన సమయం వచ్చిందని అన్నారు. వ్యవసాయరంగాన్ని రక్షించుకోవడానికి నకిలీ విత్తనాల అమ్మకాలు చేపట్టిన సంస్థ లేదా వ్యక్తి ఆస్తులను జప్తు చేసుకోవడంతో పాటుగా క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోనే నూతన విత్తన చట్టాన్ని అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు లింగంపల్లి శ్రీనివాసరెడ్డి, మోర్తాల చందద్రావు, సింగతి సాంబయ్య, పానుగంటి నరసయ్య, మాదం తిరుపతి, మాడిశెట్టి అరుణ్ కుమార్, తాటికొండ రవి, సంద గణేష్, మాలోతు రాజేష్ నాయక్, పెద్ది సూరి, నాచారం శేఖర్, బాషిపాక బాబు, తదితరులు పాల్గొన్నారు.



## పోడు భూముల సాగుదారులకు పట్టాలు అందించాలని ఎఫ్ఆర్వోకు వినతి



బెజ్జూర్ -నవభూమి: పోడు భూముల సాగుదారులకు పట్టాలు అందించాలని కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బీఆర్ఎస్ బెజ్జూరు మండల నాయకులు ఎఫ్ఆర్ఓకు వినతిపత్రం అందజేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పోడు భూముల సాగుదారులకు పట్టాలు అందించి ఆదుకుందని పేర్కొన్నారు. పోడు భూములపై సాగు చేస్తున్న గిరిజన, గిరిజనేతర రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, వారికి సాగు కొనసాగించే అవకాశం కల్పించాలని కోరారు. అటవీ శాఖ అధికారులు సానుకూలంగా స్పందించి, రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెజ్జూరు మండల నాయకులు, కార్యకర్తలు , ఆర్ఎస్పీ అభిమానులు పాల్గొన్నారు.

## ఇంద్రవెల్లిలో వైభవంగా అంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన



ఇంద్రవెల్లి-నవభూమి: మండలంలోని దస్నాపూర్ గ్రామంలో నూతన ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం, ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమ అంగరంగ వైభవంగా జరిగింది. రెండు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, కలశంతో శోభాయాత్ర నిర్వహించి ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ సందర్భంగా బాలు మహారాజ్ భక్తులకు ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుత కంప్యూటర్ యుగంలో ప్రతీ ఒక్కరు ఏదో ఒక రకంగా ఒత్తిడికి గురవుతున్నారని, దైవ చింతన అలవర్చుకోవాలని సూచించారు. దైవ చింతన వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. గ్రామంలోని పెద్దల సహకారంతో విరాళాలు సేకరించి ఆలయాన్ని నిర్మించనట్లు గ్రామస్తులు తెలిపారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ పాటులే పుండలిక్, జవాదే కేశవ్, కరాడే మారుతి, పోటే సాయినాథ్, నాందేవ్, సంతోష్, ప్రకాష్, గజానంద్, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ పోరాట యోధుడు మునీర్

మంచిర్యాల-నవభూమి: సింగరేణి కార్మికులు, ప్రజల సంక్షేమం, కోసమే జీవితాంతం పరితపించిన ప్రత్యేక రాష్ట్ర పోరాట యోధుడు మునీర్ అని జిల్లా అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఐబీ చౌరస్తాలో సింగరేణి రిటైర్డ్ కార్మికుల ఆధ్వర్యంలో జరిగిన మునీర్ సంస్మరణ సభ, అన్నదాన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.నాయకులు, కార్మికులు మునీర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గని కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం అధికారులతో తలపడి నిలబడిన గొప్ప ధైర్యశాలి మునీర్ అని ప్రసంశించారు. సింగరేణి సకల జనుల సమ్మె విజయవంతం కావడానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. సింగరేణి కార్మికులు, నాయకులు మునీర్‌ను ఆదర్శంగా తీసుకొని సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.నిజాయితీతో జర్నలిస్టు ల సమస్యల పరిష్కారానికి కార్మికుల, పేదల పక్షాన నిలబడ్డరని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీటీవో సంతోష్ కుమార్, సింగరేణి రిటైర్డ్ కార్మికులు గుడూరు యాదిరెడ్డి, వెంకట్రాజం, బార్ అసోసియేషన్ నాయకులు సందాని, కర్ర లచ్చన్న, మొహియుద్దీన్, దమ్మల శ్రీనివాస్, జలాలుదీన్, తాజ్, రాయమల్లు, రాజేందర్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిధులను ఆలయాలకు కేటాయించిన ఘనత కేసీఆర్‌దే : మాజీ మంత్రి జోగురామన్న



బేల-నవభూమి: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆలయాలకు నిధులు కేటాయించిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. బేల మండలం సిర్సన్న గ్రామంలో నూతనంగా నిర్మించిన మార్కండేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవతో పాటు విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలు , అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. అనంతరం అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయానికి రూ. 21 వేలను అందజేశారు. ఆలయాల అభివృద్ధికి కోట్ల రూపాయలు ఖర్చు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి చెందుతుందన్నారు.ప్రభుత్వ నిధులు ఆలయాలకు కేటాయించడం కేసీఆర్‌కే మాత్రమే సాధ్యమైందని కొనియాడారు. సనాతన హిందూ ధర్మాన్ని మరింత ప్రజలకు చేరువ చేస్తూ యాగాలతో పాటు యజ్ఞాలు చేశారని వివరించారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికం వైపు అడుగులు వేస్తూ, శాంతి స్థాపనతో పాటు మానసిక ప్రశాంతతను అలవర్చుకోవచ్చన్నారు.. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రవుత్ మనోహర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కళ్యాం ప్రమోద్ రెడ్డి, నాయకులు సతీష్ పవర్, విపిన్, మాస్కే తేజీరావు, బాల్ చ%శీ%దర్, దేవన్న, దీపక్ గౌడ్ , సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## అంధ విద్యార్థికి గ్రామస్థుల ఆర్థిక సహాయం



ఇంద్రవెల్లి -నవభూమి: మండలంలోని ముత్నూరు గ్రామానికి చెందిన మస్కే నితేష్ అనే అంధ విద్యార్థికి గ్రామస్థులు చేయూతను అందించారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుకుంటూ కళాశాల హాస్టల్లో ఉంటున్న అతడు ఫీజు చెల్లించాల్సి ఉండగా ఆర్థిక పరిస్థితి బాగాలేక డబ్బులు చెల్లించలేకపోయాడు.విషయం తెలుసుకున్న గ్రామస్థులు దుర్వా సంతోష్, జైస్వాల్ మనోజ్ తమవంతు ఆర్థిక సహాయాన్ని విద్యార్థి నితేష్ కు అందజేసి, అండగా నిలిచారు. చదవాలనే ఆకాంక్ష ఉన్న విద్యార్థికి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు చేయూతను అందించాలని గ్రామస్థులు కోరారు. ఈ కార్యక్రమంలో రంగుల రాజు, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

## రసాయన ఎరువులను తక్కువ మోతాదులో వాడాలి : శాస్త్రవేత్త డాక్టర్ కే రాజశేఖర్

బజార్ హత్నూర్-నవభూమి: రైతులు పంటలకు రసాయన ఎరువులను తక్కువ మోతాదులో వాడి ఖర్చులను తగ్గించుకోవాలని కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ కే రాజశేఖర్ తెలిపారు. గురువారం మండలంలోని ధర్మపురి గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారులతో కలిసి నిర్వహించారు. శాస్త్రవేత్తలు రాజశేఖర్, శివ చరణ్ రైతులతో మాట్లాడుతూ విత్తనాలను 60 నుంచి 70 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయిన తరువాతనే విత్తుకోవాలని సూచించారు. పత్తి పంటలో గులాబీ రంగు పురుగు, కాయకుళ్లు, సోయాబీన్ ,పంటలో కాండపు ఈగ, పెంకు పురుగు, మొక్కజొన్న పంటలు కత్తెర పురుగు, శనగ లో ఎండు తెగులు, కందిలో మారుకా మచ్చల పురుగు నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు.కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీ సాధి, వ్యవసాయం విస్తరణాధికారి, వెటర్నరీ అసిస్టెంట్, రైతులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు చేయాలని.. కలెక్టరేట్‌లో వరి ధాన్యం బస్తాతో రైతు నిరసన



నిర్మల్-నవభూమి: అన్నదాతల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుంది. సకాలంలో వడ్లు కొనకపోవడంతో.. అకాల వర్షాలకు తడిసి ముద్దవుతున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని నిప్పులు చెరుగుతున్నారు.నిర్మల్ జిల్లా లక్ష్మణ్‌చందా మండలం బాబాపూర్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి 15 రోజులవుతుంది. అయినప్పటికీ రైతుల నుంచి ధాన్యం సేకరించలేదు. దీంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు రైతులు. వరి ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని కోరుతూ నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆఫీసులో ధాన్యం బస్తాతో అన్నదాత నిరసన తెలిపాడు. బస్తాకు 41 కిలోలు తూకం వేస్తున్నారని.. అకాల వర్షంతో ధాన్యం తడిసిపోయి మొలకలు వస్తున్నాయని వెంటనే కలెక్టర్ స్పందించి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని అన్నదాతలు కోరారు.

## ముధోల్ ఎస్ఐగా బిట్ల పెర్సిస్




ముధోల్ -నవభూమి: ముధోల్ ఎస్ఐగా బిట్ల పెర్సిస్ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ సంజీవ్ నిర్మల్ టౌన్ పోలీస్ స్టేషన్ కు బదిలీ పై వెళ్లారు. నిర్మల్ జిల్లా షీటీ, భరోసా కేంద్ర ఎస్ఐగా పనిచేసిన బిట్ల పెర్సిస్ ముధోల్ కు బదిలీ పై వచ్చారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్ఐ తెలిపారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాం : సీఐ దేవేందర్

మహబూబాబాద్ -నవభూమి: విత్తన డీలర్లు నకిలీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను వ్యవసాయ అధికారులతో కలిసి తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ దేవేందర్ మాట్లాడుతూ లైసెన్స్ కలిగిన ఫర్టిలైజర్ దుకాణదారులు తప్పనిసరిగా రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులను అందించాలని సూచించారు.అనంతరం దుకాణాలలోని స్టాకును పరిశీలించారు రైతులకు అమ్మకం చేసిన తర్వాత వెంటనే రసీదులను అందించాలన్నారు. దుకాణాలలో ఎలాంటి అవకతవకలు జరిగిన చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏవో తిరుపతిరెడ్డి, తాసిల్దార్ రాజేశ్వర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## 30 రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలి



**బోయినపల్లి, -నవభూమి:** ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు 30 రోజులలోగా తప్పనిసరిగా ప్రారంభించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ లబ్దిదారులకు సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ బోయిన్‌పల్లి మండలంలో ప్రభుత్వ పాఠశాల గ్రౌండ్‌లో రెండో విడత కింద 709 ఇందిరమ్మ ఇండ్ల మంజూరి ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ బోయిన్‌పల్లి మండలం అనంతపల్లి గ్రామంలో పైలట్ గ్రామంగా ఎంపిక చేసుకొని మొదటి విడత కింద 109 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, 50 శాతంవరకు పూర్తయ్యాయని, ప్రభుత్వం వారికి చెల్లింపులు కూడా చేస్తుందన్నారు. రెండో విడత కింద మండల వ్యాప్తంగా 709 లబ్ధిదారులను పారదర్శకంగా అర్హులుగా ఎంపిక చేసి ఇందిరమ్మ ఇళ్ల ఉత్తర్వులు పంపిణీ చేస్తున్నామని, వీరు ఇంటి నిర్మాణం పనులు 30రోజులలోగా తప్పనిసరిగా ప్రారంభించాలన్నారు. 3 నెలల వ్యవధిలో ఇళ్ల నిర్మాణం పనులు పూర్తిచేసుకొని రానున్న పండుగలు నూతన గృహాల్లో జరుపుకోవాల ని సూచించారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు 4 దశలలో 5 లక్షల రూపాయల ఆర్థికసహాయం అందుతుందన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం మాట్లాడుతూ బోయిన్‌పల్లి మండలంలో 709 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రజల హృదయాల్లో స్పష్టమైన ముద్ర వేసుకునేలా సిరిసిల్ల కలెక్టర్ పనితీరు ఉందని ఎమ్మెల్యే ప్రశంసించారు. మానవీయ కోణంతో పని చేస్తున్న కలెక్టర్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. మిడ్ మానేరు బాధితులకు న్యాయం చేయ డం కోసం త్వరలో అదనంగా 1000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. మం డలంలో 4153 రైతులకు రూ36 కోట్ల 63 లక్షల రుణ మాఫీ పూర్తి చేశామని, గతంలో కేవలం 13కోట్ల మాత్రమే జరిగాయని ఎమ్మెల్యే తెలిపారు. ఆర్థికంగా రాష్ట్రం ఇబ్బందు లు పడుతున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ఒక్కొక్క హామీ అమలు చేస్తు న్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లేష్ యాదవ్, పిఏసి చైర్ పర్సన్ వెంకట రామారావు, సెజ్ సంచాలకులు సుధాకర్, పిడి హౌసింగ్ శంకర్, మండల ప్రత్యేక అధికారి వినోద్, ఎంపీడీవో జయశీల సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు సురేందర్ రెడ్డి రమణారెడ్డి సుధాకర్ మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 2న లబ్ధిదారులకు పత్రాలు పంపిణీ చేయాలి

**సిరిసిల్ల -నవభూమి:** రాజీవ్ యువ వికాసం పథకం కింద లాభసాటి వ్యాపార యూనిట్లు ఏర్పాటుచేసి జూన్ 2న లబ్ధిదారులకు ఎంపిక పత్రాలను అందించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం రాజీవ్ యువ వికా సం అమలుపై మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి డిప్యూటీసీఎం మల్లు భట్టి విక్రమార్క హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి కలెక్టర్ సందీ ప్ కుమార్ ఝూతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజీవ్ యువ వికాసం పథకంపై సమీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గతంలో ప్రభుత్వాలు కార్పొరేషన్ ద్వారా మొక్కుబడిగా పథకాలు అమలు చేశాయని, తమ ప్రభుత్వం లక్షలాది మంది యువతకు స్వయం ఉపాధి కల్పించాలని చిత్తశుద్ధితో రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేస్తోందన్నారు. యువ వికాసం పథ కం కింద వచ్చే సహాయంతో యువత వ్యాపారంచేసి లబ్ధి పొందాలని, రూ 8 వేల కోట్ల రూపాయలతో దాదాపు 5 లక్షల మంది యువతను వ్యాపారవేత్తలుగా మారుస్తున్నామని, ప్రభుత్వం పెట్టే ప్రతి పైసా పెట్టుబడి ఎలా పనిచేస్తుందో రెగ్యులర్‌గా మానిటరింగ్ చేయాలని, రాష్ట్ర జడీపీ వృద్ధిలో ఈ పథకం భాగస్వామ్యం కావాలని అన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన యూనిట్ల గ్రౌండింగ్ చేసిన తర్వాత వాటి పనితీరు పర్యవేక్షించేందుకు జిల్లాలో కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. మే 29, 30 తేదీలలో జరిగే ఇన్‌చార్జి మంత్రుల సమావేశాలలో రాజీవ్ యువ వికాసంపై చర్చించి తుది జాబితా ఆమోదం చేయాలన్నారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, అందులో యువ వికాసం లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపి ణీ చేయాలన్నారు. బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, లబ్దిదారుల ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదని అన్నారు.

# బల్దియాలో డీజిల్ గోల్‌మాల్

**జగిత్యాల, -నవభూమి:** జగిత్యాల మున్సిపల్ వాహనాల్లో డీజిల్ వినియోగంలో గోల్‌మాల్ జరిగింది. గతంలో ఆస్తి పన్ను వసూళ్లు, శానిటేషన్‌లో లక్ష్యాలను అధిగమించి ప్రశంసలు అందుకున్న జగిత్యాల మున్సిపాలిటీలో ప్రస్తుతం అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జగిత్యాల మున్సిపాలిటీలో ప్రతివారం శానిటేషన్ కోసం వాహనాలకు డీజిల్ పోయిస్తున్నారు. బల్దియాలో మొత్తం 72 శానిటేషన్‌కు వినియోగించే వాహనాలు ఉన్నాయి. వీటికి వారానికి సుమారు 2 వేల లీటర్ల డీజిల్ వినియోగం అవుతుందని అంచనా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరం మార్చి వరకు రూ.10 లక్షల డీజిల్ వినియోగం కాగా 2024-25 ఆర్థిక సంవత్సరం మార్చి నెల వరకు రూ.16.27 లక్షలకు పెరగడం అనుమానాలకు తావిస్తోంది. ఏడాది కాలంలో డీజిల్ వినియోగం రూ.6 లక్షలకు పైగా పెరగడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ విషయమై కొందరు కలెక్టర్ సత్యప్రసాద్‌కు ఫిర్యాదు చేయగా ఆయన ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశించి పది రోజులు గడిచినా నేటికీ విచారణ నివేదిక బయటకు రాకపోవడం గమనార్హం. డీజిల్ వ్యవహారంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు మెమో జారీ చేశారు. కూపన్ విధానానికి ఎసరు..గతంలో వాహనాల్లో డీజిల్ పోయించేందుకు ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా అప్పటి పాలకులు కూపన్ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. పారిశుధ్య వాహనంలో వారానికి ఒకసారి సుమారు 30 లీటర్ల డీజిల్ పోయిస్తుండేవారు. కమిషనర్ కూపన్ రాసి ఇస్తే, వాహనదారులు ఆ రశీదులను శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు ఇవ్వాల్సి ఉండేది. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో వాహనాల్లో డీజిల్ పోయించే విధానం ఉండేది. ఈ పద్ధతి ద్వారా ప్రతి ఏడాది సుమారు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు డీజిల్ ఖర్చు వచ్చేది. కానీ కూపన్ వ్యవస్థకు ఎసరు పెట్టడంతో గత ఏడాదిగా రూ.16 లక్షల పైచిలుకు బిల్లులు రావడం అనుమానాలకు తావిస్తోంది. కాగా మున్సిపల్ కార్యాలయంలోని వేరే విభాగంలో పనిచేస్తున్న ఓ సీనియర్ అసిస్టెంట్‌కు డీజిల్ బిల్లులు అప్పగించారు. మాన్యువల్ బిల్లులు సమర్పణ మున్సిపల్ వాహనాలకు సంబంధించి డీజిల్ పోయించేపుడు సదరు పెట్రోల్ బంకు నిర్వాహకులు కంప్యూటర్ బిల్లులు ఇస్తుంటారు. సదరు బిల్లుల్లో వాహన నంబర్, ఎన్ని లీటర్ల డీజిల్, ఎంత ధర, ఏ సమయానికి పోయించారనే పూర్తి



వివరాలు రశీదులో నిక్షిప్తమై ఉంటాయి. ఆ బిల్లులనే రిజిస్టర్‌లో ఎంట్రీ చేయాల్సి ఉంటుంది. కానీ కంప్యూటర్ బిల్లులు రావడం లేదనే నెపంతో మాన్యువల్ బిల్లులు తీసుకొని రికార్డులు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మాన్యువల్ బిల్లుల్లో వాహన నెంబర్లు లేకపోవడం మరింత అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయంపై వచ్చిన ఫిర్యాదుల మేరకు విచారణకు కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించిన నివేదిక బహిర్గతం చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేమి జగిత్యాల మున్సిపాలిటీపై పర్యవేక్షణ లోపంతో అవినీతి పెరిగిపోయిందన్న విమర్శలున్నాయి. ఈ మధ్య కాలంలో ఏసీబీ, విజిలెన్స్ దాడులు జరుగుతున్నా ఉన్నతాధికారులు కనీసం కార్యాలయాన్ని సందర్శించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ శాఖ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించకపోవడం, ఆకస్మిక తనిఖీలు లేకపోవడంతో కార్యాలయంలో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి మున్సిపల్ ఆదాయానికి గండిపడకుండా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. డీజిల్ అక్రమాలపై చర్యలు తీసుకుంటున్నాం స్పందన, మున్సిపల్ కమిషనర్, జగిత్యాల మున్సిపాలిటీలో డీజిల్ అక్రమాల ఆరోపణలపై దృష్టి సారించాం. పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు కారణమైన శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతికి మెమో జారీ చేశాం. డీజిల్ వినియోగంపై బాధ్యతలను కొత్త అధికారులను అప్పగించాం. డీజిల్ బిల్లును తగ్గించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నా.

# వానాకాలం సాగు ప్రణాళిక సిద్ధం



**కరీంనగర్ -నవభూమి:** ఇప్పటికే రాష్ట్రంలో ప్రవేశించిన నైరుతీ రుతుపవనాలతో జిల్లాలో మూడు, నాలుగు రోజుల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేస్తున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో వానాకాలం సాగుకు రైతన్నలు సన్నద్ధమవుతున్నారు. జిల్లా వ్యవసాయశాఖ ప్రణాళికను రూపొందించి ప్రభుత్వానికి పంపించింది. జిల్లాలో ఈ సీజన్‌లో 3,43,240 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని జిల్లా వ్యవసాయశాఖ అంచనా వేసింది. ప్రధాన పంట వరిని 2,76,500 ఎకరాల్లో, పత్తిని 48 వేల ఎకరాల్లో, మొక్కజొన్నను నాలుగు వేల ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేసి అందుకు తగిన ఏర్పాట్లు చేసింది. వెయ్యి ఎకరాల్లో కంది, 200 ఎకరాల్లో పెసర, వెయ్యి ఎకరాల్లో మిర్చి, 150 ఎకరాల్లో వేరుశెనగ, 13,045 ఎకరాల్లో కూరగాయలు, ఇతర హార్టికల్చర్ సాగును చేస్తారని అంచనా వేశారు. 300 ఎకరాల్లో పొగాకు సాగు చేస్తారని భావిస్తున్నారు. ఎరువులు, విత్తనాలకు ఏర్పాట్లు 3,43,240 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేసే రైతన్నలు అధిక ఉత్పత్తి సాధించడానికి ఈ పంటల కోసం 43,254 మెట్రిక్ టన్నుల యూరియా, 26,957 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 7,730 మెట్రిక్ టన్నుల ఎంవోపీ, 6,945 మెట్రిక్ టన్నుల డీఏపీ వినియోగిస్తారని వ్యవసాయశాఖ అంచనా వేశారు. అందుకు అనుగుణంగా స్టాక్‌ను విడుదల చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. 69,125 క్వింటాళ్ల వరి విత్తనాలు, 320 క్వింటాళ్ల మొక్కజొన్న, 30 క్వింటాళ్ల కందులు, 16 క్వింటాళ్ల పెసర, 90 క్వింటాళ్ల వేరుశెనగ విత్తనాలు, 88,162 ప్యాకెట్ల పత్తి విత్తనాలు అవసరమవుతాయని అంచనావేసింది. ఈ మేరకు వాటిని అందుబాటులో ఉంచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 16,809 మెట్రిక్ టన్నుల యూరియా, 31,076 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 2,593 మెట్రిక్ టన్నుల డీఏపీ, 4,836 మెట్రిక్ టన్నుల ఎంవోపీ ఎరువులు అందుబాటులో ఉన్నాయి. అవసరాన్నిబట్టి ఎప్పటికప్పుడు ప్రభుత్వం నుంచి ఎరువులు తెప్పించేందుకు జిల్లా వ్యవసాయశాఖ ఏర్పాట్లు చేస్తున్నది. ప్రధానంగా ప్రతి యేటా పత్తి విత్తనాలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. దీనిని ఆసరా చేసుకుని వ్యాపారులు ఆ విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తారు. అలాంటి వారిపై చర్యలు తీసుకునేందుకు వ్యవసాయశాఖ చర్యలు చేపట్టింది. బీటీ-3 పత్తి విత్తనాలపై నిషేధం బీటీ-3 పత్తి విత్తనాలను వాడవద్దని, ఈ విత్తనాలను సాగు చేస్తే పర్యావరణం దెబ్బతింటుందని వ్యవసాయశాఖ చెబుతున్నది. దేశంలో ఈ పత్తిని సాగు చేసేందుకు అనుమతి లేదు. బీటీ-3, బీజీ-3 విత్తనాలను హెర్బిసైడ్ టాలరెంట్ విత్తనాలుగా పేర్కొంటారు. ఈ విత్తనాలు గ్లైఫోసిన్ కలుపు మందును తట్టుకుని ఉండేలా జన్యుమార్పిడి చేసిన రకాలకు చెందినవి. ఈ విత్తనాలను సాగు చేస్తే కలుపు మందు కొట్టినా మొక్క చనిపోదని అందుకోసమే రైతులు దీన్ని సాగుచేసి అవసరానికి మించిన కలుపు మందును కొడతారు. దీంతో పర్యావరణం, జీవవైవిధ్యం దెబ్బతింటుందని వ్యవసాయశాఖ చెబుతుంది. ఈ విత్తనాల సాగుతో పత్తి మొక్క, కలుపు మొక్కల మధ్య క్రాసింగ్ జరిగి కలుపు మందును తట్టుకునే జన్యువులు కలుపు మొక్కలోకి ప్రవేశించే అవకాశం ఉంటుందని దాంతో అది సూపర్‌వీడ్‌గా మారే ప్రమాదం ఉందని చెబుతున్నారు. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి బీటీ-3 విత్తనాలు...పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి బీటీ-3 పత్తి విత్తనాలు తీసుకువచ్చి ప్రతి యేటా విక్రయిస్తున్నారు. వెయ్యి రూపాయలకు కిలో విత్తనాలను విక్రయిస్తున్నారు. విత్తనాలను విక్రయించేవారు నేరుగా గ్రామాలకు వచ్చి రైతులను కలిసి విత్తనాలను, కలుపు మందయిన గ్లైపోసెట్‌ను అమ్ముతున్నారు. పురుగుల మందు షాపుల్లో కూడా ప్రభుత్వం నిషేధించిన గ్లైపోసెట్ మందును గుట్టు చప్పుడు కాకుండా విక్రయించడం ప్రతియేటా జరుగుతున్నది. ఈ విత్తనాలను అరికట్టేందుకు జిల్లా వ్యవసాయశాఖ చర్యలు తీసుకుంటున్నా రైతులు వాటి సాగుపై మొగ్గు చూపడంతో బీటీ-3 పత్తి సాగు యథేచ్ఛగా సాగుతున్నది.